# దేహం-గేహం

"నువ్వు వెయ్యి చెప్పు; లక్ష చెప్పు. నేను మాత్రం నమ్మను" అని ఖచ్చితంగా అనేసి బారిస్టరు రామారావు సిగరెట్ పొగ తరంగాలుగా వదులుతూ కిటికీలోంచి బైటికి చూశాడు.

వాన కురుస్తూనే వుంది. ఇవాళ కూడా టెన్నిస్ లేనట్టే. కాలం గొంగళి పురుగై పాకుతోంది.

ప్రొఫెసర్ శంకరం "అయితే నేనొక కథ చెప్తాను. వినుమరి" అన్నాడు.

"నువ్వు ఎన్ని కథలైనా చెప్పగలవు. కాని నా అభిప్రాయం మారదు. నాకు ఆత్మ వుందనే నమ్మకం కుదరదు. పరమాత్మ మీద విశ్వాసం అసలే లేదు. ఊయల ఊపులతో మొదలై శ్మశానంలో చితిమంటలతో సమాప్తం అయేది జీవితం. దానికి పూర్వం ఏమీ లేదు. దానికి తరవాత అంతకంటే లేదు. గుప్పెడు బూడిద, దోసెడు దుమ్ము. అంతే పర్యవసానం. మిగిలినవన్నీ కథలు, కల్పనలు. గాలిలో తేలిపోయే ఊహాగానాలు" అని నిస్సంకోచంగా [illegible]శాడు రామారావు.

"అయితే నువ్వు నమ్మే విషయమంటూ ఏదైనా వుందా బాబు?" అని ఎత్తిపొడుస్తూ అడిగాడు పక్కనే కూచున్న డాక్టరు దామోదరం.

"కంటికి కనబడేదంతా అసత్యమనీ, కనబడనిదంతా సత్యమనీ పరమార్థమనీ బోధించే మీ వేదాంతం తప్ప ఏదైనా నమ్ముతాను" అన్నాడు రామారావు.

కొత్తగా వేదాంత ధోరణి వంట పట్టించుకుంటున్న దామోదరానికి చెడ్డకోపం వచ్చి "నీలాటి నాస్తికులు బయలుదేరబట్టే మన పవిత్ర భారత భూమికి ఇన్ని వరదలూ, కరువులూ ఉపద్రవాలూ చుట్టుకుంటున్నయ్" అన్నాడు. "మరి తమవంటి పుణ్యాత్ములున్నారు గదా దేశాన్ని రక్షించటానికి!" అని బదులు చెప్పాడు రామారావు.

ఇంతలో వెయిటర్ ముగ్గురికీ కాఫీ అందించి వెళ్లాడు. ఆ క్లబ్బుహాలు విశాల ప్రపంచాన్ని ప్రతిఫలించే చిన్న అద్దం లాగుంది. ఒక మూల జోరుగా పేకాట; ఇంకో మూల టాక్ టిక్ మంటూ బిలియర్డ్సు మరొక మూల టింగ్ టంగ్ అంటూ పింగ్ పాంగ్. వేరొక మూల ప్రపంచమంతా క్షణంలో ప్రదక్షిణం చేసివచ్చే రాజకీయాల బాతాఖానీ, మేఘమండలంలోకి అందంగా మందంగా ప్రయాణం కడుతున్న పొగమబ్బులు.

ఇంత గందరగోళం మధ్య శంకరం కథ అందుకున్నాడు. ఆయన ఈ మధ్య ఒక శుభ ముహూర్తాన ప్రొఫెసర్ అనే బిరుదు తనకి తనే తగిలించుకుని ధీమాగా తిరుగుతున్నాడు. ఆయనకి మంత్రశాస్త్రం మీద చాలా అభిమానం. మలబారు వెళ్ళి నారాయణ నంబూద్రీ అనే మహామాంత్రికుడి దగ్గర శిష్యరికం చేసివచ్చాడు. అతనంటే అందరికీ లోపల భయమే. బాల్యస్నేహితుడు కనక బారిస్టరు రామారావు మాత్రం ధైర్యంగా అతను అవునన్నదల్లా కాదంటాడు.

## "అమరేంద్ర"

"రాజారావు నాకు ప్రాణస్నేహితుడు. అతను చాలాకాలం ఇంజనీరుగా పనిచేసి ఈ మధ్యనే పింఛను పుచ్చుకున్నాడు. అతను బందరులో పనిచేసే రోజుల్లో ఫ్రెంచిపేటలో ఒక పెద్ద బంగళాలో వుండేవాడు. చవుడుపట్టిన గోడలూ, పగిలిపోయిన అద్దాల కిటికీలూ చూస్తే ఆ బంగళా షష్టిపూర్తి చేసుకుందేమో అనిపించేది.

కొన్ని ఏళ్ళ కిందట, అంటే అతను ఉద్యోగంలో చేరిన కొత్తలో అతని భార్య మధుమతి గర్భం ధరించింది. నెలలు నిండిన తరవాత పురిటికి పుట్టింటికి వెళ్ళింది. ప్రాణంలేని శిశువుని ప్రసవించి వాతం వచ్చి పురిటింటో మరణించింది. ఆ తరవాత చాలా సంవత్సరాలు రాజారావు పెళ్ళి చేసుకోలేదు. వాళ్ళది చాలా అనుకూల దాంపత్యం. శెలవల్లో ఇద్దరూ కలిసి దేశంలో వున్న ఆలయాలూ, అందమైన ప్రదేశాలూ దర్శించేవాళ్లు. ఒకరినొకరు క్షణం కూడా ఎడబాసి వుండలేక పోయేవాళ్ళు. కాకాని మృత్యువు చూడలేక ఆనందధామంగా వున్న వాళ్ళ పచ్చటి సంసారానికి చిచ్చుపెట్టింది. వియోగదుఃఖంతో రాజారావు కుంగిపోయాడు. కాని కాలం అమోఘమైనది. అన్ని గాయాలనూ మాన్పగల దివ్యౌషధం కాలం చేతుల్లో వుంది కదా!

కనకనే మధుమతిపోయిన తరవాత పదేళ్లు గడిచాక రాజారావు బెంగుళూరులో చాలా తరాలనుంచీ స్థిరపడిన వీరన్నగారి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆవిడ పేరు వసుమతి. ఆవిడ ముఖంలో మధుమతి పోలిక తొంగిచూసినందువల్లనే వసుమతిని పెళ్ళాడటానికి అంగీకరించానని రాజారావు నాతో అనేవాడు. మధుమతి తెలుగుదేశంలో మంగళగిరిలో పుట్టిన పడుచు. వసుమతి వందల మైళ్ళ దూరంలో కన్నడదేశంలో పుట్టి పెరిగిన కన్య. వీళ్ళ ముఖాలు ఒకే పోలికగా వుండటం చాలా వింత సంగతి

వసుమతి కాపురానికి వచ్చేసరికి రాజారావు బందరులో నేను ఇందాక వర్ణించిన పాత బంగళాలో వుంటున్నారు. ఇంట్లో భార్యాభర్తా ఇద్దరే. నౌకర్ల పరివారం వుండేది

ఆ రోజు రాత్రి నక్షత్రాలన్నిటినీ మింగేసిన కారుమబ్బులు ఆకాశంలో పరుగులు తీస్తున్నయ్. ఉరుములు ఫెళ ఫెళమంటూ లోకాన్ని పునాదులతో కదిపి వేస్తున్నయ్. మెరుపులు తళతళా చీకటిలో దూసుకుపోతున్నయ్. కిటికీ తలుపులు గడియలని విరగకొట్టి అదేపనిగా కిర్రుమని మూలుగుతున్నయ్, దడదడ కొట్టుకుంటూ. రాజారావు క్యాంపు నించి అర్థరాత్రి ఇంటికి వచ్చి తలుపు కొట్టాడు. కలతనిద్రలో ఉలికిపడి లేచి వచ్చి వసుమతి తలుపు తీసింది. నీలంరంగు సిల్కుచీర కట్టుకుంది. తీర్చిన సిగలో సన్నజాజి పూలదండ అర్ధచంద్రాకారంగా అమర్చుకుంది. చూడగానే చటుక్కున మధుమతి గుర్తుకు వచ్చిందిట. ఎదుట నిలబడిన స్త్రీ వసుమతి కాదేమో అని సందేహం కలిగిందిట.

స్నానం భోజనం త్వరగా ముగించి పడక గదిలోకి చేరుకున్నాడు రాజారావు. వొళ్ళంతా బడలికగా వుంది.

"ఇంత ఆలస్యం అయిందేం రాజా?" అంది వసుమతి.

అదిరిపడ్డాడు రాజారావు. ఎన్నడూ వసుమతి తనని అలా సంబోధించి ఎరుగదు. అసలు తన ఎదుట తలఎత్తి మాట్లాడేంత చనువు కూడా ఏర్పడలేదు. సిగ్గు వసుమతికి గొప్ప ఆభరణంగా వుండేది.

"దారిలో కారు చెడిపోయింది. కొ[illegible] తెరు వేసి బయలుదేరటం ఆలస్యమయింది. భయం వేసిందా?" అంటూ వసుమతి ముంగురులని మునివేళ్ళతో సవరించాడు.

"జ్ఞాపకం వుందా రాజా! ఒక నా[illegible]

మనం కారడవిలోంచి పోతూవుంటే మధ్య కారు చెడిపోయింది. కారు దిగి ఎండుటాకులు పోగుచేసి చలిమంటలు వేసుకుంటూ తెల్లవార్లూ కూచున్నాం. పులుల గాండ్రింపులూ, నక్కల కూతలూ వింటుంటే గుండెలు పీచుపీచుమన్నయ్. మీదగ్గిరగా జరిగి గుండెలమీద తలవాల్చి గజగజ వణికిపోతూ రాత్రంతా మేలుకున్నాను. గుర్తులేదా రాజా?" అంది వసుమతి.

రాజారావు దడదడలాడిపోయాడు. మధుమతి బతికున్నప్పుడు ఒకనాడు ఈ సంఘటన జరిగినమాట నిజమే. కాని ఆసంగతి వసుమతికి ఎల్లా తెలిసింది? తన అనుభవాన్ని వర్ణిస్తున్నట్లుగా మాట్లాడుతుందేమిటి వసుమతి? తికమకలో దిక్కుతోచక దీపం వెలిగించాడు రాజారావు.

"దీపంఆర్పివెయ్యి రాజా! ఇదివరకోసారి నేను 'కపాలకుండల' నవల చదువుతుంటే మధ్యలో దీపం ఆర్పేసి కొంటెగా "చీకట్లో చూడాలి నీకళ్ళ తళతళలు" అన్నారు గుర్తులేదూ?" అంటూ వసుమతి వింతగా అతని కళ్ళలోకి చూసింది. ఆమె దేహం ఏదో విచిత్రశక్తికి గేహం అయినట్లు తోచింది.

ఆమె బుజాలమీద చేతులు వేసి ఊపుతూ "ఏమిటి వసూ, నువ్విలా మాట్లాడుతున్నావేం ఇవాళ? ఏం జరిగింది? ఏమిటి ఇదంతా?" అని గట్టిగాఅడిగాడు.

"నేనేం తప్పుమాట్లాడాను రాజా!

మీరు మరిచిపోతున్న సంగతులు గుర్తుకి తేవటం తప్పా?" అని అతని గడ్డాన్ని వేళ్ళతో తాకుతూ బతిమాలుకుంటున్నట్లు అడిగింది.

"కాదు. కాని నీకీసంగతు లన్నీ ఎల్లా తెలుసు వసూ?" అని ఆశ్చర్యం వెల్లడించాడు భర్త.

"ఏమో...ఏమో...అన్నీ తెలుసు నాకు. నన్నడగకండి..." అంటూ పక్కకి తిరిగి కళ్లు మూసుకుంది వసుమతి. ఎంతో అలిసిపోయినమనిషిలాగా నిద్రపోయింది. కళ్లలో వొత్తులు వేసుకుని కూచున్న రాజారావుకి భళ్లున తెలవారింది.

అల్లాగే ప్రతిరాత్రీ వసుమతి ఎన్నెన్నో కబుర్లూ, కథలూ గతస్మృతులు నెమరు వేసుకుంటున్నట్లుగా చెప్పుకుపోయేది. మధుమతికీ రాజారావుకీమధ్య నడిచిన ప్రణయ కలాపాలూ, కలహాలూ అన్నీ తనకి తెలిసినట్లుగా వసుమతి ఏకరువుపెట్టేది. మధుమతి డైరీ ఏదైనా రాసిందేమో? అది రహస్యంగా చదివి వసుమతి ఈ వింతనాటకం ఆడి తన భరతం పట్టిస్తున్నదేమో? కాని మధుమతి అంతగా చదువుకోలేదు. దినచర్యలు రాసే అలవాటు ఆవిడకి అసలే వుండేదికాదు. ఇంట్లో గోడమీద మధుమతి ఫోటో ఒకటి తప్ప ఇంకే స్మృతిచిహ్నమైన వస్తువూ లేదు.

ఒక కార్తీకపూర్ణిమకి దంపతులు మంగినపూడిరేవుకి సముద్రస్నానానికి వెళ్లారు. వసుమతి పసిపిల్లలాగా ఇసకతో అలలతో ఆడుకుంటూ "చూచోండి రాజాగారూ! మరిచిపోయారా? అడయారుదగ్గిరసముద్రతీరంలో ఎన్ని వెన్నెలరాత్రులు ఇద్దరమూ ఒంటరిగా పోయిగా ఎన్నెన్ని పాటలు పాడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గడిపామో గుర్తుందా? "దూరాన దూరాన ఈ జలధి తీరాన..."అనేపాట నానోట ఎన్నిసార్లు వినేవారోమీరు. మరిచిపోయారా?" అని అడిగేసరికి శూలంతో గుండెలో గుచ్చినట్లనిపించింది అతనికి. నిజమే ఆపాట పాడమని మధుమతిని ఎన్నోసార్లు బతిమాలుకుని తనివితీరా విని ఆనందించేవాడు. ఎప్పటి పాటకి? ఎన్నేళ్ళకిందటిమాటకి? తనూ మధుమతీ మద్రాసులో కాపరంపెట్టి చదువుకునేనాటి ముచ్చట. ఈసంగతి ఎల్లా తెలిసింది వసుమతికి? రాజారావు తల రంగులరాట్నంలాగా తిరిగిపోయింది. అంతా అయోమయంగా, అగాధంగా తోచింది.

ఇంకోరాత్రి సినిమాకివెళ్లారు. అందులో పండువెన్నెలరాత్రి తాజ్ మహల్ కనిపించింది. వసుమతి వెంటనే భర్తమీద చెయ్యివేసి "మనం ఆగ్రా వెళ్ళినప్పుడు వెన్నెట్లో తాజ్ మహల్ చూశాంకదండీ? కాశ్మీర్ లో డాల్ సరస్సులో పువ్వుల్ని చూసినంత సంబరంతో మనస్సు మురిసిపోయింది. "ఈ ముంతాజ్ మరణిస్తే నా రాజా ఎటువంటి స్మారకచిహ్నం నిర్మిస్తారో?" అంటే ఎడం చెంప చెళ్ళుమనిపించారు రాజాగారు. అన్నీ మరిచిపోయారా?" అంటూ మొదలు పెట్టింది. చుట్టుపక్కల ప్రేక్షకులు వినుకుతో, వింతగా తమవైపు చూస్తుంటే భరించలేక రాజారావు ఆటమధ్యలోనే ఇంటికి పోదాం రమ్మని వసుమతిని తీసుకుని బైటికి వచ్చేశాడు.

ఇల్లా నాలుగేళ్ళు గడిచినై. వసుమతి నవ్వు మధుమతి నవ్వుకి ప్రతిధ్వనిగా వినిపించేది. కొంచెం కీచుగావుండే వసుమతి స్వరంలో మధుమతి గాత్రమాధుర్యం నిండి తొణికేది. వసుమతి ప్రతికదలికలో మధుమతి తొంగిచూసేది. రాజారావు అసహాయుడైన ప్రేక్షకుడిలాగా ఈ విచిత్ర సంఘటనలు చూస్తూ లోపల కుమిలిపోతున్నాడు.

అతనిప్రాణం విసిగిపోయింది; ఉద్యోగానికి శెలవుపెట్టి దిగులుతో మంచంపట్టాడు. బతకడేమోనని అంతా ఆందోళన పడ్డారు.

ఇలావుండగా ఒకనాటి తెల్లవారుఝామున ఉన్నట్లుండి హోరుగాలి రేగింది. తలుపు లన్నీ టపాటపా మోగినయి. ఇంట్లో దీపాలన్నీ ఊగి గభాలున ఆరిపోయినాయ్.

"రాజా!" అన్న సంబోధనవిని రాజారావు బెదిరిపోయి లేచి కూచున్నాడు.

దిగంచలంలోకి దూది పింజలాంటి మబ్బు జారి వచ్చింది. ఆమబ్బులోంచి నందివర్ధనం పూలరాసిలాగా వున్న వేషంతో మెలగాచల్లగా కదిలివచ్చి మంచం దగ్గర నిలబడి పిలిచింది. ఆప్యాయంగా వంగి సుకుమారమైన కరాంగుళులతో నాజూకుగా అతనితల నిమురుతూ నిలబడింది...ఎవరో? కాదు కాదు మధుమతిలాగే వుంది పోలిక అవే కళ్లు అదే చిరునవ్వు పెదవులమీద!


గార్మెంటోన్

బీరువాలలో, ట్రంకులలో మరియు అలమారులలో కీటకములు మీ విలువైన బట్టలను, పుస్తకములను పాడుచేస్తూంటే 'గార్మెంటోన్' వాడండి. 'గార్మెంటోన్'ను పెట్టిన చోట్ల కీటకములు చేరవు. ప్లాస్టిక్ డబ్బాలో వచ్చే యీతయారు 6 లేక 8 నెలలవరకు పని చేస్తుంది.

వివరములకు:

గంటి అండ్ కంపెనీ,

23, హమామ్ స్ట్రీట్, ఫోర్ట్, బొంబాయి-1.



# మీ అబ్బాయి చదువు

మీ అబ్బాయి చదువును ఎ. ఎస్. మూర్తి, ఎం. ఏ. వ్రాసిన విద్యాదర్శిని అనే పుస్తకం చదివి నిర్ణయించండి. అందులో 32 రకాల యింజనీరింగు చదువులను గురించి, 84 రకాల వృత్తి చదువులనుగురించి, 20 రకాల డాక్టరు చదువులను గురించి, వీటికి హైస్కూలుచదువునుంచి తీసుకోవలసిన జాగ్రత్తలు, హైస్కూలు చదువు అవగానే కాలేజీ చదువు అవసరం లేకుండా డబ్బుసంపాదనకు పనికివచ్చే ఎన్నో యితర చదువులు, మనదేశంలోని రకరకాల కాలేజీలు, వాటి ఎడ్రసులు వాటిలో చెప్పే చదువులు, వాటికి అయ్యే ఖర్చులు. విదేశ చదువుల వివరాలు, స్కూలుఫైనలు తప్పినవారికి మంచి భవిష్యత్తునిచ్చే, చదువులు, యీ రకమైనవి, పిల్లల చదువులకు సంబంధించిన అ... విషయాలు విద్యాదర్శినిలో ఉన్నాయి. చదువుకొనేపిల్లలున్న ప్రతివారికి యీ 'విద్యాదర్శిని' అనే పుస్తకందాలా అవసరం. 320 పేజీలు. వెల వి.పి.పోస్టు ఖర్చుతో రు. 5. మూర్తి & వినాయ...,ఎబర్సు రోడ్డు, మద్రాసు-14 అనేఅడ్రసుకు మీకుకూడా ఒకపుస్తకం వెంటనే పంపించమని ఉత్తరం వ్రాయండి

SWASTIK

# దేహం - గేహం

"నేను నీకేం అపచారంచేశాను మధుమతీ? నా జీవనభాండంలో విషబిందువులు పోస్తావా? నాదారిన నన్ను బతకనివ్వవా? నిన్ను దీనంగా వేడుకుంటున్నాను. నా సుఖాన్ని ఈవిధంగా ధ్వంసం చెయ్యటమే నీకు ఆనందమా? అయితే ఇదుగో ఇప్పుడే నీ కళ్లు చల్లబడేటట్టు ప్రాణం తీసుకుంటాను" అంటూ ఆవేశంగాలేచి డ్రాయరులో వున్న రివాల్వరు తీసి కణతలకి గురిపెట్టుకుని కాల్చబోయాడు రాజారావు.

వద్దు వద్దు రాజా! నామాటవినండి" అని చిత్రాలున రివాల్వరు లాగి దూరంగా విసిరేసింది.

"అయితే నాకేమిటిదారి?" అన్నాడు రాజారావు.

"నేను బాలింతరాలుగా చనిపోయాను, మీకు గుర్తుందా? నాలాగా దుర్మరణానికి పాలుకాకుండా బీద తల్లులని కాపాడండి. నేనిక మీ సుఖానికి ఆటంకం కల్పించను. ఇంకెన్నడూ మీకంటికి కావలన్నా కనిపించను రాజా!" అంటూవచ్చిన దారినే కదిలి ఆకాశపు అంచున వ్రేలాడుతున్న పున్నాగ పూలవంటి తెలిమబ్బుల దొంతరలో మటుమాయమై పోయింది.

ప్రక్కనే నిద్రపోతున్న వసుమతి కెవ్వన కేకవేసి మంచంమీదినుంచి కిందికి దొర్లిపడింది.

ఆరినదీపాలు తళుక్కున వెలిగినై. పరమ లోభిగా పేరుమోసిన రాజారావు అమాంతం పదివేలుపెట్టి ఒక ఉచిత ప్రసూతి వైద్యశాల కట్టించి దానికి మధుమతి పేరు పెట్టాడు.

ఆ తరవాత వసుమతి భర్తని "రాజా!" అని ఎన్నడూ సంబోధించలేదుట. గత కాలంమీద వాలిన తెరమరి పైకిలేవదు. ఈ మధ్యనే మగపిల్లాణ్ని కన్నదని రాజారావు ఉత్తరంరాశాడు.

ప్రొఫెసర్ శంకరం కథ ముగించేసరికి వింటూ కుర్చీలకి అంటుకుపోయిన శ్రోతలు ఉలిక్కిపడిలేచారు.

"My dear Horatio! There are more things in heaven and earth than aredreamtofinyourPhilosophy" అంటూ డాక్టర్ దామోదరం రామారావు భుజంమీద చరిచాడు.

"నాన్సెన్స్ నేను చచ్చినా నమ్మను. ఇదంతా అభూతకల్పన" అని ఈసడించాడు రామారావు.

"అవును నా స్వప్నం కల్పనకంటే విడ్డూరంగా వుంటుంది!" అంటూ లేచాడు శంకరం.

వర్షం ఇంకా వెలవలేదు. నిలిచిన నీళ్ళగుంటల్లో విద్యుద్దీపాలనీడలు ఉయ్యాలలూగుతున్నయ్. మబ్బుల మేడల్లో మెరుపు దివ్వెలవలె తారలు తళుక్కుమంటున్నయ్.

"తుది సెరుంగని ఇది మొదలు తెలియని ఆటరా!" అని ఏమూలనుంచో పాడుతూ మాధూకవళం అడుగుతున్న ముసలి భిక్షుకుని కంఠం వినబడుతోంది. ★

